నానమ్మకు చేదోడు వాదోడు

జ్వరం రావడంతో దవాఖానకు తీసుకువచ్చిన మనుమరాలు

సెలవు వస్తే చాలు పిల్లలు రోజంతా సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడడం.. లేదంటే యూట్యూబ్‌లో కార్టూన్స్, షార్ట్స్ చూస్తుంటారు. కానీ గూడూరు మండలం రాళ్లవాగు దస్రుతండాకు చెందిన గుగులోత్ శివాని తన నానమ్మ గుగులోత్ కొమ్మికి జ్వరం రావడంతో గురువారం దవాఖానకు తీసుకువచ్చింది. వృద్ధురాలికి వెన్ను పూస పూర్తిగా వంగి, కళ్లు కనిపించకపోవడంతో మండల కేంద్రలోని సీహెచ్‌సీకి ఆటోలో తీసుకువచ్చింది. చేయి పట్టుకొని డాక్టర్ వద్దకు తీసుకెళ్లి చూపించి ఇంటికి తీసుకెళ్లింది. మనుమరాలు అన్ని పనుల్లో తనకు చేదోడువాదోడుగా ఉంటుందని వృద్ధురాలు చెప్పింది. బాలికను చూసిన పలువురు అభినందించారు.

– గూడూరు, జనవరి 16

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా..

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి దయాకర్‌రావు పరామర్శ

పెద్దవంగర, జనవరి 16: అధైర్యపడొద్దు.. ఆపదలో ఉన్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని అవుతాపురానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు బెల్లంకొండ ఎల్లగౌడ్ కుమారుడు శివకుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో, బొమ్మరబోయిన సోమన్న అనారోగ్యంతో మృతిచెందారు. మృతుల పార్థివదేహాలపై మాజీ మంత్రి ఎర్రబెల్లి పూలమాల ఉంచి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ.. అన్ని విధాలా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, సుధీర్‌కుమార్, వెంకన్న, కృష్ణమూర్తి, సోమనర్సయ్య, యాకయ్య, అశోక్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

ఊట్ల గ్రామాన్ని సందర్శించిన ఎస్టీ కమిషన్ సభ్యుడు

గూడూరు, జనవరి 16: మండలంలోని మారుమూల ఏజెన్సీ ఊట్ల గ్రామంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ గురువారం పర్యటించారు. గ్రామంలోని గిరిజనులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ భవనం లేదని గ్రామస్తులు తెలియజేయగా పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. మాజీ ఎంపీపీ చెల్పూరి వెంకన్న, మాజీ సర్పంచ్ మోతీలాల్ పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న హుస్సేన్‌నాయక్

సర్వేను పకడ్బందీగా చేయాలి

డోర్నకల్: గొల్లచర్లలో సర్వే పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణవేణి

నమస్తే నెట్‌వర్క్, జనవరి 16: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల సర్వేను పకడ్బందీగా చేయాలని ఆర్డీవో కృష్ణవేణి అన్నారు. గురువారం డోర్నకల్ మండలం అమ్మపాలెం, గొల్లచర్ల గ్రామాల్లో సర్వేను ఆర్డీవో పరిశీలించారు. సాగులో ఉన్న భూమి, సాగులో లేని బీడు భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ కృష్ణవేణి, ఆర్ఐ యాసిన్‌పాషా, సర్వేయర్ వెంకన్న పాల్గొన్నారు. మరిపెడ మండలం గిరిపురంలో చేపట్టిన సర్వేను తహసీల్దార్ సైదులు పరిశీలించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి, జంగిలికొండ, అమనగల్, ఈదులపూసపల్లిలో సర్వేను తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పరిశీలించారు. ఈనెల 19 వరకు సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఏవో తిరుపతిరెడ్డి, ఏఈవో పున్నమి పాల్గొన్నారు. నర్సింహులపేటలో సర్వేను డీఏవో విజయ నిర్మల పరిశీలించారు. ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏవో వినయ్‌కుమార్, ఏఈవో బాబు ఉన్నారు. గార్ల మండలం బుద్దారం గ్రామ పంచాయతీ పరిధిలో సర్వేను తహసీల్దార్ రవీందర్ పరిశీలించారు. రైతులు రావూరి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

19న కొత్త టీచర్లకు సదస్సు

మహబూబాబాద్ రూరల్, జనవరి 16: ఈనెల 19న నూతన ఉపాధ్యాయులకు తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత తెలిపారు. గురువారం పట్టణంలో సదస్సు కరపత్రాలు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు బలాష్కి రమేశ్, శ్రీశైలం, శ్రీనివాస్, ఉపేందర్, అంజయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

ఇరువైపులా డ్రెయినేజీల ఆక్రమణ

- రోడ్డుపైనే వస్తువులు పెట్టి విక్రయం
- మార్జిన్లలో టిఫిన్, పండ్ల బండ్లు
- రోడ్డుపైనే బైక్స్ పార్కింగ్
- మరిపెడ పట్టణంలో తీవ్ర ట్రాఫిక్ జామ్

వాహనాలతో రద్దీగా మారిన ప్రధాన రహదారి

రోడ్డుపై చిరువ్యాపారులు పెట్టుకున్న బండ్లు, బైక్స్ పార్కింగ్

మరిపెడ, జనవరి 16 : మున్సిపాలిటీలో జాతీయ రహదారి, రాష్ట్ర రహదారి కలయికతో ఉన్న రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ కాల్వలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇరువైపులా దుకాణాల నిర్వాహకులు కాలువలపై వస్తువులు పెట్టి విక్రయిస్తున్నారు. కొనుగోలుదారులు రోడ్లపైనే ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమై నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి మహబూబాబాద్ క్రాస్ రోడ్డు, కార్గిల్ సెంటర్ నుంచి సబ్‌స్టేషన్ వరకు రెండు వైపులా డ్రెయినేజీలను ఆక్రమించుకొని వాడుకుంటున్నారు.

రోడ్ల మార్జిన్లు ఆక్రమణ

నిత్యం రద్దీగా ఉండే హైవేలో కొందరు వ్యాపారులు నిబంధనలకు వ్యతిరేకంగా డ్రెయినేజీలను ఆక్రమించుకుంటూ వాటిపై శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా గత ప్రభుత్వం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసింది. రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్స్‌ను వ్యాపారులు ఆక్రమించి వస్తువులను ముందుకు విస్తరిస్తున్నారు. డ్రెయిన్లు, మార్జిన్లలో పెద్ద సంఖ్యలో టిఫిన్ సెంటర్లు, ఫ్రూట్స్, జ్యూస్ సెంటర్, పూలదుకాణాలు వెలిశాయి. రోడ్డుపై ఉదయం నుంచి రాత్రి వరకు అడుగు తీసి అడుగు వేయడానికి వీల్లేకుండా రద్దీ ఉంటోంది. షాపుల వద్దకు వచ్చే వాహనదారులు బైక్‌లు, కార్లు రోడ్డు మధ్యలో నిలిపేస్తున్నారు. దీంతో వాహనాలనను షాపుల ఎదుట రోడ్డుపై నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లోపించిన పారిశుధ్యం

హైవేకు ఇరువైపులా వ్యాపారులు డ్రెయినేజీలు ఆక్రమించుకోవడంతో దుకాణాల్లోని వ్యర్థాలను సైతం కాల్వల్లోనే పడేయడంతో పారిశుధ్యం లోపిస్తోంది. డ్రెయిన్స్ ఆక్రమణతో ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు కాల్వలను శుభ్రం చేయడకుండా వదిలేస్తున్నారు. దీంతో మురుగు నీటి ప్రవాహం నిలిచి సమీపంలోని నివాసాల మధ్య రోడ్లపై మురికినీరు పారుతోందని స్థానికులు చెబుతున్నారు.

అధికారులు స్పందించాలి

మురుగు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతోపాటు మురుగు నీటి పారుదలకు ఆటంకం కలుగుతోంది. దీనిపై పురపాలక సంఘం టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్ల ఆక్రమణ సమస్య తెలిసినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్‌కు శంకుస్థాపన

నెల్లికుదురు, జనవరి 16: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఇందిరమ్మ మోడల్ హౌస్‌కు మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, దశలవారీగా రూ.5లక్షల చొప్పున చెల్లిస్తుందని తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో ఎవరైనా డబ్బులు అడిగితే తన నంబర్ 83284 73007కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. తహసీల్దార్ కె.రాజు, ఎంపీడీవో బాలరాజు, ఎంపీవో పద్మ పాల్గొన్నారు.

హర్షిత్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

మహబూబాబాద్ రూరల్: పట్టణంలో ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి దైద హర్షిత్ ఆదర్శంగా తీసుకుని మొక్కలు నాటాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. గురువారం పట్టణంలో 24వ వార్డులో సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. హర్షిత్‌ను శాలువాతో సన్మానించారు. పద్మం ప్రవీణ్, మాదకబోయిన యాకన్న, దిలీప్, రాజు పాల్గొన్నారు.

ఎంపీడీఓ ఆఫీస్ ఆవరణలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

సర్వే పరిశీలించిన కలెక్టర్

నర్సింహులపేట: మండల కేంద్రంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

నర్సింహులపేట/ చిన్నగూడూరు /దంతాలపల్లి, జనవరి 16: కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ గురువారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. నర్సింహులపేట మండల కేంద్రంతోపాటు ముంగిమడుగు, చిన్నగూడూరు మండల కేంద్రంతోపాటు గుండం రాజుపల్లి, దంతాలపల్లి మండలం ఆగపేట, గున్నెపల్లిల్లో రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా కోసం కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇంటి నిర్మాణాలు, వెంచర్లు, గుట్టలు, కాల్వల నిర్మాణాలు, చెక్ డ్యాంలు తదితర భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. నర్సింహులపేట తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో మాధవి, ఏవో వినయ్‌కుమార్, ఆర్ఐ అఖిల్, ఎంపీవో యాకయ్య, ఏఈవో బాబు, చిన్నగూడూరు తహసీల్దార్ మహబూబ్‌అలీ, ఎంపీడీఓ రామారావు, కార్యదర్శులు సోమన్న, శ్రీకాంత్ ఉన్నారు. దంతాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. 'సిరంజీల్లేవు.. బయట తెచ్చుకోండి' అంటూ సిబ్బంది పేషెంట్‌కు చెప్పారని, వైద్యం అందలేదని పత్రికల్లో రాగా డాక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పేషెంట్‌కు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించిన ఘటనపై విచారణ చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఎంపీడీవో వివేక్‌రాం, డీటీ శ్రీలత, ఏవో వహిని, ఎంపీవో అఫ్సర్‌పాషా, ఆర్ఐ నజీ మోద్దీన్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 16 : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని డీటీవో జైపాల్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని మూడు కొట్ల సెంటర్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్‌ను పెట్టుకోవాలని, సిగ్నల్స్ చూసి వాహనాలు నడపాలని చెప్పారు. వాహనదారులకు గులాబీ పూలు అందించి జాగ్రత్తల గురించి తెలియజేశారు. మోటర్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్స్ సాయిచరణ్, వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకొని ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్, జనవరి 16: ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం జరిగింది. టౌన్ సీఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మూడుకొట్ల సెంటర్ ప్రాంతంలో నివసిస్తున్న సాము వెంకటనారాయణ(70) భార్య అనారోగ్యంతో ఐదేళ్ల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి మనస్తాపం చెందుతున్నాడు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు శ్రావణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 16 : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొత్తపల్లి రవి, సూర్యం డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీన వేతనాలు అందిస్తున్నట్లు గొప్పలు చెబుతూ మున్సిపల్ కార్మికులకు సకాలంలో ఇవ్వటం లేదన్నారు. మురికి కాల్వలను శుభ్రం చేస్తూ అనేక మంది కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారని, వెంటనే నెల నెలా జీతాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీరన్న, వెంకన్న, మధు, మహేందర్, సరిత పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి

సమావేశంలో మాట్లాడుతున్న భీమానాయక్

మహబూబాబాద్ రూరల్, జనవరి 16: పట్టణంలోని ప్రభుత్వ భూములను కాపాడాలని లంబాడీ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 107సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూములను ఆక్రమణకు గురవుతున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు వెంటనే ప్రభుత్వ భూముల్లో పక్కా భవనాలు నిర్మించాలన్నారు. ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకునే వరకు దశలవారీ ఉద్యమాలు చేస్తామని అన్నారు. విష్ణునాయక్, శివవర్మ, మంగీలాల్, బాలు, రాందాస్‌నాయక్, శ్రీను, వీరన్న, సుధాకర్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

నెల్లికుదురు, జనవరి 16: మండలంలోని నైనాల గ్రామంలో పెరుమాండ్ల జగన్నాథం జ్ఞాపకార్థం గాయత్రి గ్రానైట్స్ సౌజన్యంతో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బుధవారం రాత్రి బహుమతులు ప్రదానం చేశారు. 2023-24లో ఎస్సెస్సీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, నూతనంగా ప్రభుత్వ ఉద్యోగం పొందిన బొడ్డు రవికుమార్‌ను సన్మానించారు. ఎదళ్ల యాదవరెడ్డి, హెచ్చ వెంకటేశ్వర్లు, యాసం రమేశ్, బానాల యాకయ్య, పెరుమాండ్ల తిలక్ బాబు, సైదులు, సత్యనారాయణ, రమేశ్, య్యాకయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

వర్ధంతి సభను జయప్రదం చేయండి

కురవి, జనవరి 16: మండల కేంద్రంలోని సీపీఐ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం సీపీఐ జిల్లా నాయకుడు సురేందర్ కుమార్(సూరి) రెండో వర్ధంతిని జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కర్ణం రాజన్న పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూరి మండల కార్యదర్శిగా, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పనిచేసి ఎన్నో ప్రజా ఉద్యమాలు కొనసాగించి, చిన్న వయస్సులోనే అమరుడయ్యాడని తెలిపారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. సీపీఐ నాయకులు తురక రమేశ్, కన్నె వెంకన్న, కలగూర నాగరాజు పాల్గొన్నారు.

'బెనిఫిట్స్ చెల్లించలేకే విరమణ వయసు పెంపు'

సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్

నెల్లికుదురు, జనవరి 16: విరమణ పొందిన ఉద్యోగికి బెనిఫిట్స్ చెల్లించలేకనే విరమణ వయసు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని గురువారం టీపీటీఎఫ్ మండల కార్యదర్శి శ్రీరామ్ ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ విరమణ వయసు పెంచాలనే ప్రభుత్వ నిర్ణయం ఎంతో మంది నిరుద్యోగులకు నష్టదాయకమన్నారు. నిరుద్యోగులు ప్రభుత్వ కొలువు కోసం ఏళ్లుగా సంసిద్ధులవుతున్నారని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఉద్యోగ విరమణ వయసు 61 ఏళ్లు సరిపోతుందన్నారు. విరమణ ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యూటీ, కమ్యూనిటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, జడ్పీ జీపీఎస్ ఫైనల్ పేమెంట్స్ బెనిఫిట్స్ చెల్లించలేకనే ప్రభుత్వం వయస్సు పెంపు యోచన చేస్తున్నదని, తక్షణమే ఈ ఆలోచన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2024లో రిటైరైన ఏ ఉద్యోగికి ప్రభుత్వం బెనిఫిట్స్ చెల్లించలేదని ఆరోపించారు. ఆ సంఘం నాయకులు భిక్షపతి, రవి పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేయాలి

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య

తొర్రూరు, జనవరి 16 : మున్సిపాలిటీ పరిధిలో పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ మంగలపల్లి రామచంద్రయ్య అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కమిషనర్ పీ శాంతికుమార్ ఆధ్వర్యంలో పాలకవర్గ సమావేశం ప్రశాంతంగా జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ 56 అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం వాటిని ఏకగ్రీవంగా తీర్మానించారు. మున్సిపల్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, కౌన్సిలర్లు భూసాని రాము, తునమ్ రోజా, సంగీత రవి, పేర్ల యమునా జంప, సునీత జై సింగ్, నర్కుటీ గజానంద్, చకిలేలా అలివేలు, దొంగరి రేవతీ శంకర్, కర్నే నాగజ్యోతీ నాగరాజు, గుగులోత్ శంకర్, కొలుపుల శంకర్, బిజ్జల అనిల్ మాధవి పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు

డోర్నకల్: గుడుంబా ధ్వంసం చేస్తున్న అధికారులు

మహబూబాబాద్ రూరల్/ డోర్నకల్, జనవరి 16: ఎక్సైజ్ పోలీసులు గురువారం జిల్లాలోని పలు గుడుంబా స్థావరాలపై దాడులు చేశారు. ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. సీరోలు మండలం కొత్తతండా, సాదుతండా, మన్నెగూడెం ఏరియాల్లోని గుడుంబా స్థావరాలపై దాడులు చేసి 21లీటర్ల నాటుసారా, వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం, 25కేజీల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. వాంకుడోత్ సేవియా, బిచ్చు, సంతోష్, బద్రమ్మ, నాగరాజుపై కేసు నమోదు చేసి, సీరోలు తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు అశోక్, మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు. డోర్నకల్ మండలం పెరుమాండ్ల సంకీస చెందిన కిన్నెర సైదమ్మ ఇంటి వెనుక ఖాళీ స్థలంలో దాచిన 6లీటర్లు గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమ తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి

తొర్రూరు, జనవరి 16 : మండలంలోని అమ్మాపురానికి చెందిన శతాధిక వృద్ధురాలు కొలిపాక లచ్చమ్మ (101) గురువారం కన్నుమూశారు. ఆమె భర్త కోలిపాక కిష్టయ్య కొన్నేళ్ల క్రితం మృతిచెందారు. వారికి నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం కాగా, మనవళ్లు, మనవరాళ్ల వివాహాలయ్యాయి.

అనారోగ్యంతో అటెండర్..

మరిపెడ, జనవరి 16: ఉపాధి హామీ కార్యాలయంలో సహాయ అటెండర్‌గా పని చేస్తున్న మందల ఉమ(45) అనారోగ్యంతో చికిత్సపొందుతూ గురువారం మృతి చెందింది. 2011లో నుంచి సహాయ అటెండర్‌గా పనిచేస్తోంది. మూడు నెలల క్రితం ఊపిరితిత్తుల సంబంధ సమస్యతో హాస్పిటల్‌లో చేరగా, చికిత్సపొందుతూ మృతిచెందింది. ఆమెకు ముగ్గురు కుమారులు, భర్త ఉన్నారు.

నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

బాధిత కుటుంబానికి రెడ్యా పరామర్శ

మరిపెడ/చిన్నగూడూరు, జనవరి 16: బాధిత కుటుంబాలను డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, డీఎస్ రవిచంద్ర గురువారం పరామర్శించారు. మరిపెడ మండలం ఏల్లంపేటకు చెందిన పెద్దగండి రామనాథం అనారోగ్యంతో మృతిచెందగా, పార్థివదేహంపై వారు పూలమాల ఉంచి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్ఎస్ నాయకుడు తాళ్లపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ తాళ్లపల్లి రఘు, మాజీ కోఆప్షన్ మెంబర్ ఆయాబ్‌పాషా, గండి మహేశ్, సాయిబాబా, భద్రయ్య పాల్గొన్నారు. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి శివారు దేవోజీతండాకు చెందిన సక్రి అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. పార్థివ దేహంపై మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పూలమాల ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 16 : యువత చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ సరవయ్య అన్నారు. గురువారం మండలంలోని జమాండ్లపల్లిలో నామిరెడ్డి వెంకటరెడ్డి, పార్వతమ్మ జ్ఞాపకార్థం నామిరెడ్డి జాయింట్ ఫ్యామిలీ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఉద్యోగాల్లో అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. కాగా, గురువారం ఫైనల్ పోటీల్లో జమాండ్లపల్లి జట్టుపై ముత్యాలమ్మగూడెం జట్టు విజయం సాధించింది. విన్నర్ టీమ్‌కు రూ.15,116, రన్నర్ టీమ్‌కు రూ.8,116, మెమొంటో, షీల్డ్‌లు నామిరెడ్డి సీతారాంరెడ్డి చేతులమీదుగా అందజేశారు. రూరల్ ఎస్సై దీపిక, ఆర్గనైజర్ కమిటీ నరేష్, నవీన్, సాయి, బండి వెంకన్న, సింగంశెట్టి బాబురావు, అంబాల శివ, సరేష్ పాల్గొన్నారు.

క్రికెట్ విజేత టీమ్‌కు బహుమతి అందజేస్తున్న సీఐ సర్వయ్య, నామిరెడ్డి సీతారాంరెడ్డి

250 గజాల స్థలం జీపీకి దానం

పంచాయతీ కార్యదర్శికి భూదాన పత్రం అందజేస్తున్న రమేశ్ దంపతులు

నర్సింహులపేట, జనవరి 16: మండల కేంద్రామైన నర్సింహులపేట గ్రామంలో జీపీ పరిధిలోని బెత మల్ల రమేశ్ అనే వ్యక్తి జీపీకి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లకు 250 గజాల ఇంటి జాగను గురువారం దానంకు సంబధించిన పత్రాలు చేశాడు. గ్రామంలోని 2-23/1లో తన వాటకు వచ్చిన ఇంటి స్థలంను అంగన్‌వాడీ భవనం నిర్మాణం కోసం ఇచ్చినట్లు రమేశ్ తెలిపాడు. అంగన్‌వాడీ భవనం నిర్మాణం కోసం స్థలం ఇవ్వడంపై గ్రామ ప్రజలు అభినందించారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

తొర్రూరు, జనవరి 16 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు ఆలకుంట్ల సాయన్న, జాటోత్ భిక్షపతి డిమాండ్ చేశారు. గురువారం తొర్రూరులో ఖమ్మం, వరంగల్ జిల్లాల కమిటీ సదస్సు జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర లేక, పెట్టుబడి రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఏజెన్సీలోని పోడు భూములకు పట్టాలు రాక బ్యాంకుల్లో రుణాలు